మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలి

దహెగాం, సెప్టెంబర్ 26 : కేజీబీవీ, ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీ పార్ట్‌టైం ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి డిమాండ్ చేశారు. గురువారం దహెగాం మండలంలోని వివిధ పాఠశాలల్లో టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీలకు 4 నెలలుగా వేతనాలు ఇవ్వలేదని వెంటనే చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు తులసీరామ్, రోహిత్, కోశాధికారి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోల బాధ్యతలు

మందమర్రి రూరల్, సెప్టెంబర్ 26: రామకృష్ణపూర్ జడ్పీహెచ్ఎస్ బాలురు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు, మండల నోడల్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ఎస్.శ్రీనివాస్‌ను మందమర్రి మండల విద్యాధికారిగా గురువారం బాధ్యతలను స్వీకరించారు. శ్రీనివాస్‌ను ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు సన్మానించారు.

నెన్నెల ఎంఈవోగా చంద్రశేఖర్ రెడ్డి

నెన్నెల,సెప్టెంబర్ 26: నెన్నెల మండల విద్యాధికారిగా చంద్రశేఖర్‌రెడ్డి గురువారం మండల విద్యా వనరుల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను మండల వనరుల సిబ్బంది శాలువాతో సన్మానించారు.

దండేపల్లి ఎంఈవోగా దుర్గం చిన్నయ్య

దండేపల్లి, సెప్టెంబర్26: దండేపల్లి మండల విద్యాధికారిగా దుర్గం చిన్నయ్య గురువారం ఎమ్మార్సీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంఈవోకు మండలంలోని సీఆర్పీలు, పీఆర్టీయూ టీఎస్ మండల నాయకులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు రావనవేణి రవి, మల్యాల మల్లేశ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కొండు జనార్దన్, అప్పాల మనోహర్, పాత రమేశ్, మండలంలోని సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి ఎంఈవోగా శివచరణ్ కుమార్

వాంకిడి,సెప్టెంబర్ 26: వాంకిడి ఎంఈవోగా శివ చరణ్‌కుమార్ స్థానిక విద్యా వనరుల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శివచరణ్ కుమార్‌ను ఎమ్మార్సీ సిబ్బంది, ఉపాధ్యాయులు, సీఆర్పీలు సన్మానించారు.

లక్షెట్టిపేట ఎంఈవోగా హెలన్‌డార్థి

లక్షెట్టిపేట,సెప్టెంబర్ 26: లక్షెట్టిపేట మండల విద్యాధికారిణిగా హెలన్‌డార్థి గురువారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఎంఈవోగా విధులు నిర్వహించిన కాసుల రవీందర్ ఇటీవల సాధారణ బదిలీల్లో కరీంనగర్ జిల్లా నగునూర్ పాఠశాలకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో వెంకట్రావుపేట ప్రధానోపాధ్యాయురాలు హెలన్‌డార్థి ఎఫ్ఏసీగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

రెబ్బెన ఎంఈవోగా వెంకటేశ్వర్

రెబ్బెన, సెప్టెంబర్ 26: రెబ్బెన ఎంఈవోగా మోకార్తి వెంకటేశ్వర్ బాధ్యతలు స్వీకరించగా, ఇక్కడ విధులు నిర్వహించిన వెంకటేశ్వరస్వామి కాసిపేట ఎంఈవోగా బదిలీపై వెళ్లినట్లు అధికారులు పేర్కొన్నారు. బాధ్యతలు చేపట్టిన మోకార్తి వెంకటేశ్వర్లును పీఆర్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సునార్కర్ అనిల్‌కుమార్, రెబ్బెన శాఖ మండల అధ్యక్షుడు బత్తుల సదానందం, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు వినోద్, సీఆర్పీలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఉపాధ్యాయులు మార్యద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాసిపేట ఎంఈవో వెంకటేశ్వరస్వామి, పలువురు ఉన్నారు.

గ్రాట్యూటీ రూ.20 లక్షలు చెల్లించాలి

బెల్లంపల్లి, సెప్టెంబర్ 26 : సింగరేణి రిటైర్డ్ కార్మికులకు గ్రాట్యూటీ రూ.20 లక్షలు చెల్లించాలని టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి మణిరామ్‌సింగ్ డిమాండ్ చేశారు. ఈ డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. కోర్టు తీర్పు ప్రకారం 2017 జనవరి 1 నుంచి సింగరేణి రిటైర్డ్ కార్మికులకు రూ.20 లక్షలు గ్రాట్యూటీ చెల్లించాలని పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం నుంచి కార్మికులకు డబ్బులు ఇప్పించి సత్వరమే న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆవాల మధుసూదన్ రెడ్డి, మేకల రాజయ్య, బుల్లు సత్తయ్య, దాగం పోశం, ఆవులూరి ఓదేలు, తామెర్‌ఖాన్, ఓదేలు పాల్గొన్నారు.

గిరిజన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 26: గిరిజన ప్రాంత చట్టాలు 1/70, పెసా చట్టంపై ప్రతి అధికారి అవగాహన కలిగి ఉండాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మండల ప్రత్యేక అధికారులు, ఏజెన్సీ గ్రామ పంచాయతీల కార్యదర్శులకు 5వ షెడ్యూల్, గిరిజన ప్రాంత, ఏజెన్సీ చట్టాలు, దేశ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లోని చట్టాల ఉల్లంఘన జరగకుండా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనుల సంక్షేమం, హక్కుల రక్షణ కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక అధికారి ఎంఏ ఆదిల్ ఏజెన్సీ చట్టాలు, పెసా చట్టంలోని పలు అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, డీపీవో భిక్షపతి, ఉట్నూర్ ఎస్‌డీసీ గంగాధర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దీపావళి బోనస్ రూ.లక్ష ఇవ్వాలి

- బెల్లంపల్లి ఏరియా టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు

మాట్లాడుతున్న టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు

రెబ్బెన, సెప్టెంబర్ 26: కోల్ ఇండియా యాజమాన్యంతో ఈ నేల 29న జరిగే స్టాండర్డ్ కమిటీ సమావేశంలో జాతీయ కార్మిక సంఘాలు గట్టిగా పట్టుబట్టి సింగరేణి ఉద్యోగులకు లక్ష రూపాయలు దీపావళి బోనస్‌ను ఇప్పించే విధంగా కృషి చేయాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఏరియాలోని గోలేటి టీబీజీకేఎస్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్ల నుంచి కేవలం రూ.5 వేలు నుంచి 6వేలు మాత్రమే పెంచుతున్నారని, గతేడాది రూ.85 వేలు మాత్రమే ఇచ్చారని, ఈ సారి పెరిగిన ధరలకు అనుగుణంగా లక్ష రూపాయలకు తగ్గకుండా దీపావళి బోనస్‌ను ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ ఏరియా కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, కేంద్ర కమిటీ సభ్యుడు మాంతు సమ్మయ్య పాల్గొన్నారు.

నికర లాభాల్లో నుంచి 33% వాటా చెల్లించాలి

సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 26 : సింగరేణి నికర లాభాలు రూ.4701 కోట్ల నుంచి 33 శాతం 1551 కోట్లు వాటాను కార్మికులకు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు డిమాండ్ చేశారు. గురువారం శ్రీరాంపూర్ ఆర్కే 7గనిపై గేట్‌మీటింగ్ అనంతరం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద 30 వేల కోట్లు సింగరేణి డబ్బులు ఉన్నాయని చెప్పారు. వాటి నుంచి సంస్థ అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం యాజమాన్యానికి వత్తాసు పలకడం అన్యాయమన్నారు. ఆర్కే 7 పిట్ కార్యదర్శి శ్రీధర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు సంకె రవి, బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి అంబాల శ్రీనివాస్, కోశాధికారి కస్తూరి చంద్రశేఖర్, నాయకులు బానేశ్, వెంగల శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, భగవాన్, ప్రవీణ్, నవీన్, నరేశ్, అనిల్, రవీందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు

మున్సిపాలిటీ కార్మికులకు వైద్య శిబిరం

చెన్నూర్, సెప్టెంబర్ 26 : చెన్నూర్ మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు గురువారం మున్సిపాలిటీ కార్యాలయంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నవాజొద్దీన్, కమిషనర్ గంగాధర్, అంగ్రాజ్‌పల్లి ప్రాథమిక కేంద్రం డాక్టర్ సత్యనారాయణ, హెచ్ఈవో జగదీశ్, కౌన్సిలర్లు రేవెల్లి మహేశ్, జగన్నాథుల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు మేడ సురేశ్‌రెడ్డి, ఆరీఫ్, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 26: కాగజ్‌నగర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సిర్పూర్ పేపర్ మిల్, స్పర్శ్ సోషల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించి మున్సిపల్ సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మేనేజర్ క్రాంతి, డీఈ రమాదేవి, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ ప్రనీల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, సిబ్బంది రఫీక్, సుధాకర్, స్పర్శ్ సోషల్ ఫౌండేషన్ మేనేజర్ రీనా, ప్రాజెక్టు ఆఫీసర్ సుందరం తదితరులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ చిట్టీల పంపిణీ

మందమర్రి, సెప్టెంబర్ 26: సింగరేణి మందమర్రి ఏరియా జీఎం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏరియా జీఎం జీ దేవేందర్ కార్యాలయ ఉద్యోగులకు సీఎంపీఎఫ్ చిట్టీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం రాజేశ్వర్ రెడ్డి, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీవైపీఎం ఎండీ ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో రాజకీయ జోక్యం సరికాదు

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 26 : రాజకీయ జోక్యంతో సింగరేణిలో నిజాయితీ అధికారులపై చర్యలు సరికాదని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య పేర్కొన్నారు. గురువారం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ డైరెక్టర్(పా, పీపీ) ఎన్‌వీకే శ్రీనివాస్‌ను ప్రభుత్వం తొలగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. సంస్థలో రాజకీయ జోక్యం తగదన్నారు. క్వార్టర్ల కేటాయింపు నుంచి మొదలు కొని మెడికల్ బోర్డులు, ఉద్యోగోన్నతులు, బదిలీలో అవకతవకలు జరిగి అవినీతి పెరుగుతుందని ఆరోపించారు. లాభాల వాటా చెల్లింపుపై కొన్ని కార్మిక సంఘాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ముస్కె సమ్మయ్య, రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, పిట్ కార్యదర్శులు సదానందం, బాపు, రవీందర్, నర్సింగారావు, నాయకులు పాషా, వెంకటేశం, దేవేందర్ఇ సురేశ్, పరశురాం పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ ఏరియా స్టోర్స్‌లో స్వచ్ఛ భారత్

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 26 : శ్రీరాంపూర్ ఏరియా స్టోర్స్‌లో గురువారం డీవైజీఎం మల్లయ్య ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. డీవైజీఎం అరవిందరావు, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, టింబర్ యార్డు ఇన్‌చార్జి జక్కారెడ్డి, ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ హనుమాన్‌గౌడ్ పాల్గొని ఏరియా స్టోర్స్‌లో పరిశుభ్రత పనులు నిర్వహించారు. చెత్తా చెదారాన్ని తొలగించారు. స్టోర్స్ ఈఈ శేఖర్, పిట్ కార్యదర్శి కుమారస్వామి పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కోటపల్లి, సెప్టెంబర్ 26 : కోటపల్లి మోడల్ స్కూల్‌లో ఫిజిక్స్, బోటనీ సబ్జెక్టులను గంటల ప్రాతిపదికన బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాజశేఖర్ ప్రకటనలో కోరారు. పీజీ, బీఎడ్ ఉన్న అభ్యర్థులు అర్హులని, అభ్యర్థులు వారి ధ్రువీకరణ పత్రాలతో నేటిలోగా కోటపల్లి మోడల్ స్కూల్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

అండర్ గ్రౌండ్ అలవెన్స్ కోత విధించడంపై ధర్నా

కాసిపేట, సెప్టెంబర్ 26 : మందమర్రి ఏరియా కాసిపేట 1వ గనిలో యాజమాన్యం అవసరాల నిమిత్తం సర్వేస్‌లో పని చేసిన 473 మంది కార్మికులకు అండర్ గ్రౌండ్ అలవెన్స్ యాజమాన్యం కోత విధించడాన్ని నిరసిస్తూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. అనంతరం గని ఇన్‌చార్జి మేనేజర్ నిఖిల్ అయ్యర్‌కు వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్ మాట్లాడుతూ ఈ సమస్యపై గ్రూప్ ఏజెంట్ రామ్ దాస్‌తో మాట్లాడామని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు చిప్పరి శ్రీహరి, సహాయ కార్యదర్శి పార్వతి సురేశ్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ రంజిత్ కుమార్, ఏరియా ఇన్‌చార్జి లింగయ్య, కోల కమలాకర్, ఐ సంపత్, రఘురాం, బియ్యాల రాజన్న, ఆడెపు రవీందర్, పల్లెం శ్రీనివాస్, దామోదర్, శంకర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా లాన్ టెన్నిస్ పోటీలు

బెల్లంపల్లి, సెప్టెంబర్ 26 : బెల్లంపల్లి ఏరియా 91వ వార్షిక క్రీడల్లో భాగంగా పట్టణంలోని టీసీవోఏ క్లబ్ ఆవరణలో గురువారం డిపార్ట్‌మెంట్ లాన్ టెన్నిస్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. సింగరేణి ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. గతంలో కోల్ ఇండియా స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ కిరణ్, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నవంబర్‌లో రిజిస్ట్రేషన్ బాదుడు!

- భారీగా పెరగనున్న చార్జీలు
- తుదిదశకు చేరిన థర్డ్ పార్టీ ఏజెన్సీ అధ్యయనం

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): నవంబర్ నుంచి సవరించిన చార్జీలను రిజిస్ట్రేషన్ చార్జీలను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. వాస్తవానికి వ్యవసాయ, వ్యవసాయేతర, స్థిరాస్తుల రిజిస్ట్రేషన్‌కు కొత్త ధరలను ఆగస్టు 1 నుంచే అమలు చేయాలని భావించింది. ఈ మేరకు స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ జూన్‌లో షెడ్యూల్‌ను విడుదల చేసింది. అధికారులు జిల్లాల్లో అధ్యయనం చేసి ప్రభుత్వానికి జూలైలో నివేదిక ఇచ్చారు. ఈ నివేదికపై ప్రభుత్వం సంతృప్తి చెందలేదు. దీంతో ధరల సవరణ అధ్యయన బాధ్యతలను ఓ ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారు. రాష్ట్రవ్యాప్తంగా సర్వే నంబర్ల వారీగా భూముల విలువను అధ్యయనం చేసి, ఎక్కడ పెంచేందుకు అవకాశం ఉన్నదో, ఎక్కడ తగ్గించాల్సి వస్తుందో, ఎంత మేర సవరించాలో సూచించాలని పేర్కొన్నది. ఈ మేరకు ప్రైవేట్ సంస్థ అధ్యయనం తుది దశకు చేరిందని రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలు తెలిపాయి. ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం పనులు ప్రారంభం కావడం, ఫ్యూచర్ సిటీ పేరుతో కొత్త నగరాన్ని నిర్మించాలన్న ప్రభుత్వ లక్ష్యాల నేపథ్యంలో వాటి చుట్టుపక్కల ప్రాంతాల్లో భూముల సవరణపైనా అధ్యయనం చేసినట్టు చెప్తున్నారు. వారంరోజుల్లో ఈ నివేదిక ప్రభుత్వానికి చేరనున్నట్టు సమాచారం. ప్రభుత్వం సమీక్ష అనంతరం ఏ స్థాయిలో ధరలను సవరించాలో నిర్ణయిస్తారని చెప్తున్నారు. నవంబర్ మొదటివారంలో పెంపును అమలు చేసే అవకాశం ఉంది. 'ఇది రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు కాదు. శాస్త్రీయంగా ధరల స్థిరీకరణ. స్థానిక పరిస్థితులను బట్టి చార్జీలు పెంచాలో, తగ్గించాలో నిర్ణయం తీసుకొని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది' అని రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారి తెలిపారు.

బది'లీలల'పై కొరడా?

రిజిస్ట్రేషన్ల శాఖలో ఇటీవల బదిలీల్లో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకుంటారని సమాచారం. ఈ బదిలీల్లో అధికార పక్ష నేతలు, ఉన్నతాధికారుల సన్నిహితులకు కోరుకున్న స్థానాలను కట్టబెట్టారని ఆరోపణలు వచ్చాయి. రూ.కోట్ల మేర చేతులు మారినట్టు చర్చ జరిగింది. కొందరు అధికారులే దళారుల అవతారం ఎత్తి పోస్టింగ్‌ల బదిలీలల్లో కీలక పాత్ర పోషించారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ మంత్రి, సీఎం గుర్రుగా ఉన్నట్టు సచివాలయ వర్గాలు చెప్తున్నాయి. త్వరలోనే చర్యలు తీసుకోనున్నట్టు సమాచారం.

సహకార డెయిరీలకు సమాధి!

- హైదరాబాద్ పాలమార్కెట్‌పై ఆధిపత్యానికి హెరిటేజ్ యత్నం
- సర్కారు ప్రోత్సాహంతో ప్రాంతేతరుల పెట్టుబడులు
- శ్వేత విప్లవానికి బాటలు వేసిన కేసీఆర్ ప్రభుత్వం
- స్వరాష్ట్ర రైతుల పుట్టిముంచుతున్న రేవంత్ సర్కారు
- ఒక్కో లీటర్‌పై రూ.4 నుంచి రూ.7 వ్యత్యాసం
- అదే ధరకు సేకరిస్తే రాష్ట్ర పాడి రైతుకు తీవ్రనష్టం

ఈ నెల 23న ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో రోడ్డుపై పాలను పారపోసి నిరసన తెలుపుతున్న పాడి రైతులు

కరీంనగర్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పాడి రైతు మెడపై ప్రాంతేతరుల కత్తి వేలాడుతున్నది. స్వరాష్ట్రంలో శ్వేత విప్లవానికి కేసీఆర్ ప్రభుత్వం బాటలు వేస్తే.. కాంగ్రెస్ సర్కారు కుట్రల కారణంగా విజయ డెయిరీతోపాటు మిగిలిన కో ఆపరేటివ్ డెయిరీల మనుగడ కూడా ప్రమాదంలో పడే అవకాశం కనిపిస్తున్నది. ఏపీ సీఎం చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ సంస్థ రాష్ట్రంలో రూ.200 కోట్లకుపైగా పెట్టుబడితో శామీర్‌పేటలో డెయిరీతోపాటు ఐస్‌క్రీం తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయబోతున్నట్టు తెలుస్తున్నది. దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంపూర్ణంగా సహకరిస్తున్నట్టు సమాచారం. రాష్ట్రంలో పాలవిక్రయాల అతి పెద్ద మార్కెట్ హైదరాబాద్. ఇక్కడ రోజుకు 20 లక్షల నుంచి 22 లక్షల లీటర్లకుపైగా డిమాండ్ ఉంది. ఈ డిమాండ్‌కు అనుగుణంగా మార్కెట్‌ను అందిపుచ్చుకోవడంలో విజయ డెయిరీ లాంటివి కాస్త వెనుకబడగా..ఇపుడు ఆ మార్కెట్‌ను ప్రాంతేతర డెయిరీలు ఆక్రమిస్తున్నాయి. హెరిటేజ్, జెర్సీ, అమూల్, నందిని వంటి డెయిరీలు.. స్థానిక డెయిరీలకు మించి మార్కెట్‌లో విక్రయాలు చేస్తున్నాయి. ఒక్క హెరిటేజ్ వాళ్లే రోజుకు హైదరాబాద్‌లో 5 లక్షల లీటర్లకు పైగా పాల విక్రయాలు చేస్తున్నట్టు సదరు రంగంలోని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఈ సంస్థ పెట్టుబడులు పెట్టి హైదరాబాద్ మార్కెట్ మొత్తం శాసిస్తే రాష్ట్రంలోని విజయ డెయిరీతోపాటు కోఆపరేటివ్ డెయిరీలైన కరీంనగర్, ముల్కనూరు వంటి వాటి భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకునే ప్రమాదమున్నది.

రైతుల ఆదాయంపై దెబ్బ?

నిజానికి పాడి పరిశ్రమను ఆహ్వానించడం ఎవరూ తప్పుపట్టరు. కానీ సదరు పరిశ్రమతో రాష్ట్రంలోని పాడిరైతులకు వచ్చే ప్రమాదాలను పట్టించుకోకుండా రేవంత్ సర్కారు ముందు కెళ్తున్న తీరుపై విమర్శలొస్తున్నాయి. ఇప్పటికే హెరిటేజ్‌లాంటి సంస్థల దాటికి విజయ డెయిరీ కుదేలవుతుండగా.. ఇపుడు ఇతర కో-ఆపరేటివ్ డెయిరీలకూ ముప్పు పొంచిఉన్నది. దీనికి కారణం తెలంగాణతో పోలిస్తే ఆంధ్రాలో రైతులకు ఇచ్చే ఒక లీటర పాల ధరలో రూ.4 నుంచి రూ.7 వరకు వ్యత్యాసం ఉండడమే. ప్రస్తుతం 3 శాతం ఫ్యాట్ ఉన్న పాలను కరీంనగర్ డెయిరీ లీటర్‌కు రూ. 35.65కు కొనుగోలు చేస్తుండగా.. ఏపీలోని చిత్తూరులో రూ.31.50కు కొనుగోలు చేస్తున్నారు. 3.5 శాతం ఫ్యాట్ ఉన్న లీటర్‌పాలను చిత్తూరులో రూ.33కు కొనుగోలు చేస్తుండగా, కరీంనగర్ డెయిరీ రూ.40.25కు కొనుగోలు చేస్తున్నది. అంటే ఒక్కో లీటర్‌పై రూ.4 నుంచి రూ.7 వరకు తేడా ఉన్నది. అక్కడ తక్కువ ధరకు కొనుగోలు చేసి.. రాష్ట్రంలోని డెయిరీల మార్కెట్‌ను దెబ్బతీసేందుకు సరికొత్త స్కీమ్ పెట్టి లేదా.. ధర తగ్గించి సదరు కంపెనీలు పాలు అమ్మే పరిస్థితులు కనిపిస్తున్నాయి. హైదరాబాద్‌లో ఇప్పటికే పలు పాల కంపెనీలు ఈ తరహా మార్కెటింగ్‌కు పాల్పడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రాంతేతర డెయిరీల పోటీని తట్టుకోవాలంటే రాష్ట్రంలోని కోఆపరేటివ్ డెయిరీలైన కరీంనగర్, ముల్కనూరు డెయిరీలు కూడా రైతుకు ఇచ్చే పాలసేకరణ ధరను తగ్గించాల్సి ఉంటుంది. పాల ధర తగ్గించకపోతే మార్కెట్ విక్రయాల్లో ఈ డెయిరీలు వెనుకబడిపోయే ప్రమాదమున్నది. తద్వారా డెయిరీలే మూతపడే ప్రమాదమున్నది. అదే జరిగితే కరీంనగర్, మూల్కనూరు డెయిరీ పరిధిలోనే దాదాపు 3 లక్షలకు పైగా పాడి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదమున్నది. ప్రాంతేతర డెయిరీల మార్కెట్‌కు దీటుగా పాలసేకరణ ధరలు తగ్గిస్తే రైతులకు గిట్టుబాటు కావన్నది నిపుణుల అభిప్రాయం. ఆంధ్రాలోని పాడిరైతులకు వచ్చే ఖర్చుతో పోల్చితే.. తెలంగాణలో వాతావారణం, ఇతర మార్పుల నేపథ్యంలో 25 శాతానికిపైగా అదనపు ఖర్చు వస్తుందని పాడిపరిశ్రమ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇక్కడి రైతాంగానికి సరిపడా రేటు గిట్టుబాటు అయ్యేందుకు కావాల్సిన చర్యలపై ప్రభుత్వం దృష్టిపెటాలన్న అభిప్రాయాలు వ్యక్తవుతున్నాయి.

సగం చేపపిల్లలకు సర్కారు కోత

- తొలుత 85 కోట్ల పిల్లల పంపిణీకి ఏర్పాట్లు
- టెండర్ల సమయానికి 40కోట్లకే పరిమితి
- కాంగ్రెస్ ప్రభుత్వం నిధులవ్యకనే ఈ దుస్థితి
- నాలుగుసార్లు టెండర్లు పిలిచినా స్పందన కరువు
- బకాయిలపై ప్రశ్నించిన రైతులకు బెదిరింపులు

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): ఉచిత చేపపిల్లల పంపిణీలో ప్రభుత్వం కోత పెట్టింది. సగానికి సగం కోత పెట్టిన ప్రభుత్వం 50శాతం చేపపిల్లల్ని మాత్రమే పంపిణీ చేయాలని నిర్ణయించింది. తొలుత 85 కోట్ల చేపపిల్లల పంపిణీకి ప్రణాళికలు రూపొందించిన మత్స్యశాఖ.. టెండర్ల సమయానికి 40 కోట్లకే పరిమితం చేసింది. చేపపిల్లల పంపిణీలో కోతకు ప్రభుత్వం తగినన్ని నిధులు ఇవ్వకపోవడమే కారణమని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న నిధులతో 40కోట్లు పంపిణీ చేస్తామని, ప్రభుత్వం నిధులిస్తే మిగిలిన సగం పంపిణీ చేస్తామని స్పష్టం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతియేట 80 కోట్ల చేపల పిల్లల్ని, మరో 10 కోట్ల రొయ్య పిల్లల్ని పంపిణీ చేసేంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తొలి ఏడాదే చేపపిల్లల పంపిణీకి కోత పెట్టడంపై మత్